జనాభా ప్రాతిపదికన సీట్లు కేటాయించాలి

ఆత్మకూరు: రాష్ట్రంలో బీసీలకు జనాభా ప్రాతిపదికన పార్లమెంట్, అసెంబ్లీ స్థానాల్లో సీట్లు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి నాగేశ్వరరావు యాదవ్, రాష్ట్ర కార్యదర్శి రఘురాముడు యాదవ్, మార్కెట్‌యార్డ్ చైర్మన్ బాలస్వామి యాదవ్, గౌరవాధ్యక్షులు రామకృష్ణ కోరారు. పట్టణంలోని బీసీ సంక్షేమ కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. త్వరలో బీసీల చైతన్యం కోసం త్వరలో రాష్ట్రంలో రథ యాత్ర నిర్వహిస్తామన్నారు.

మహిళా బిల్లులో బీసీలకు చోటు కల్పించాలి

నందికొట్కూరు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళా బిల్లులో బీసీ మహిళలకు చోటు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి నాగేశ్వరరావు యాదవ్ కోరారు. పట్టణంలో జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో నియోజకవర్గ అధ్యక్షులుగా నాగలూటి గోకారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షులు కురుమూర్తి, కార్యదర్శి ఆంజనేయులు, పట్టణ అధ్యక్షులు విజయ్ పాల్గొన్నారు.

శక్తిస్వరూపిణీ.. మహిషాసురమర్దిని


ఓంకారంలో దుర్గాదేవిగా శ్రీ ఉమాదేవి అమ్మవారు


మహిషాసురమర్దిని దేవిగా కొలనుభారతిదేవి

మహానంది: దసరా నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం దుర్గాష్టమి వేడుకలు వైభవంగా జరిగాయి. మహానంది పుణ్యక్షేత్రంలో ఉదయం నుంచి రాత్రి వరకు విశేష పూజలు నిర్వహించారు. యాగశాలలో చండీయాగం శాస్త్రోక్తంగా జరిగింది. బండిఆత్మకూరు మండలంలోని ఓంకారం పుణ్యక్షేత్రంలో దుర్గాష్టమి సందర్భంగా శ్రీ గంగా, ఉమా సమేత ఓంకార సిద్ధేశ్వరస్వామికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన పూజలు వైభవంగా జరిగాయి. అమ్మవారిని మహిషాసురమర్దినిగా అలంకరించారు. కాకనూరులోని శ్రీ శారదాపీఠంలో పీఠాధిపతి శ్రీ శివయోగీంద్ర సరస్వతీ స్వామి ఆధ్వర్యంలో శ్రీ శారదా అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు.

శ్రీశైలంప్రాజెక్ట్: స్థానిక వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో అమ్మవారి శ్రీదుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

కొత్తపల్లి: మండలంలోని కొలనుభారతి క్షేత్రంలో అమ్మవారు భక్తులకు శ్రీ మహిషాసురమర్దిని దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. అమ్మవారిని విశేషాలంకరణచేసి అభిషేకాలు, అర్చనలు, వంటి పూజకార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.

వెలుగోడు: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు మహిషాసుర మర్దిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వేల్పనూరులోని అంకాలమ్మ ఆలయంలో అమ్మవారు మహాగౌరి దేవి అలంకరణలో దర్శనమిచ్చారు.

ఆత్మకూరు: పట్టణంలోని కన్యకాపరమేశ్వరి మాత ఆదివారం శ్రీమహిషాసురమర్దిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. చౌడేశ్వరి దేవాలయంలో అమ్మవారిని శ్రీదుర్గాదేవిగా అలంకరించారు.

జూపాడుబంగ్లా: స్థానిక సరస్వతీ అమ్మవారు మహిషాసురమర్దిని రూపంలో, తాటిపాడు శ్రీవీరభద్ర స్వామి ఆలయంలో వెలసిన అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

మిడుతూరు: స్థానిక కన్యకాపరమేశ్వరీ ఆలయం, చౌడేశ్వరీ దేవీ ఆలయంలో అమ్మవార్లు ఆదివారం దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

నందికొట్కూరు: శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరీ ఆలయంలో భక్తులందరికీ శ్రీ దుర్గాదేవి అలంకారంలో ఆదివారం అమ్మవారు దర్శనమిచ్చారు.

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని కొణిదేల గ్రామంలోని భ్రమరాంబమల్లిఖార్జున స్వామి దేవాలయంలో అమ్మవారు దుర్గాదేవీ అలంకరణలో దర్శనమిచ్చారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో ఇస్రో చీఫ్ మేనేజర్


వేదపండితుల ఆశీర్వచనం అందుకుంటున్న సీజీఎం టీవీ రమణారెడ్డి

మహానంది: మహానందీశ్వరస్వామి సన్నిధిలో ఇస్రో చీఫ్ జనరల్ మేనేజర్ టీవీ రమణారెడ్డి ఆదివారం పూజలు నిర్వహించారు. ఆయనకు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. అనంతరం స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. దర్శనం అనంతరం స్థానిక యాగశాలలో ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు.

భ్రమరాంబా మల్లికార్జునస్వామికి పట్టువస్త్రాలు


కంచికామకోటి పీఠం తరఫున పట్టువస్త్రాలను తీసుకువస్తున్న దృశ్యం

శ్రీశైలంటెంపుల్: దసరా మహోత్సవాలను పురస్కరించుకుని కంచికామకోటి పీఠం వారు శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్లకు ఆదివారం పట్టువస్త్రాలు సమర్పించారు. కంచి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామివారి ఆదేశాల మేరకు ఈ పట్టువస్త్రాలు సమర్పించినట్లుగా స్థానిక శంకరమఠం సిబ్బంది తెలిపారు. ఆదివారం ఉదయం పట్టువస్త్రాలతో ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న వీరికి దేవస్థానం ఈఓ డి.పెద్దిరాజు, ఉభయదేవాలయాల ప్రధానార్చకులు తదితరులు సాదరంగా ఆహ్వానం పలికారు. అనంతరం వీరు సంప్రదాయబద్ధంగా స్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో సత్తాచాటిన కర్నూలు జట్టు

పగిడ్యాల/ఆత్మకూరు: చిత్తూరు జిల్లా, యాదమర్రిలో జరిగిన రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో కర్నూలు జిల్లా జట్టు సత్తాచాటి తృతీయ స్థానంలో నిలిచినట్లు ఖోఖో అసోసియేషన్ చైర్మన్ నాగిరెడ్డి, ప్రెసిడెంటు శంకర్, సెక్రెటరీ ప్రభాకర్, అసోషియేషన్ సభ్యులు పగిడ్యాల జడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం మధుసూదన్, ఆత్మకూరు పీఈటీ ప్రభాకర్ తెలిపారు. రాష్ట్ర స్థాయిక్రీడల్లో సత్తాచాటిన జిల్లా క్రీడాకారులను వారు ఆదివారం అభినందించారు.

తెప్పోత్సవం ఏర్పాట్ల పరిశీలన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో జరుగుతున్న శరన్నవరాత్రుల్లో భాగంగా 24వ తేదీ రాత్రి స్వామిఅమ్మవార్లకు పుష్కరిణిలో నిర్వహించే తెప్పోత్సవం ఏర్పాట్లను ఆదివారం ఈఓ డి.పెద్దిరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ తెప్పోత్సవం సమయంలో పుష్కరిణిలో తగినంత నీటిమట్టం ఉండే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ పరిశీలనలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వి.రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

మల్లన్న సేవలో జేసీ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్లను ఆదివారం నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం వద్ద ఈఓ డి.పెద్దిరాజు, అర్చకులు ఆలయమర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం వీరు స్వామిఅమ్మవార్లను ప్రత్యేకంగా దర్శించుకున్నారు.

పేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్


చెక్కు అందజేసిన ఎమ్మెల్యే ఆర్థర్

నందికొట్కూరు: ఆపదలో ఉన్న పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ పథకం ఓ వరమని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నందికొట్కూరు మండలం అల్లూరు గ్రామానికి చెందిన కురవ కృష్ణవేణి ఆరోగ్య వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ. 60 వేలు, బ్రాహ్మణకొట్కూరుకు చెందిన మొల్ల నసీరుద్దీన్‌కు రూ.80 వేలు, పాములపాడు మండలంలోని ఇస్కాల గ్రామానికి చెందిన తిప్పనగారి లింగస్వామికి రూ.1.20 లక్షలు, పట్టణంలోని హాజీనగర్‌కు చెందిన షేక్ వలికి రూ. 2 లక్షల చెక్కులను బాధితులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు అండగా నిలిచేందుకే సీఎం రిలీఫ్ ఫండ్ పథకం అమలు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు మద్దూరు హరిసర్వోత్తమరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తూడిచెర్లలో మూడిళ్లల్లో చోరీ

జూపాడుబంగ్లా: తూడిచెర్ల గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున దొంగలు మూడిళ్లల్లో చోరీకి పాల్పడ్డారు. బాధితులు, ఎస్‌ఐ మారుతిశంకర్ తెలిపిన వివరాల మేరకు...గ్రామానికి చెందిన దూదేకుల జరీనా, ఆమె భర్త బాలదస్తగిరి పిల్లలకు ఆరోగ్యం బాగోలేకపోవటంతో ఇంటికి తాళం వేసి నందికొట్కూరులో డాక్టర్ వద్ద చూపించుకొనేందుకు వెళ్లారు. అక్కడ ఆలస్యం కావటంతో జరీనా దంపతులు ఆమె పుట్టినిల్లు అయిన వీపనగండ్లకు వెళ్లారు. ఆదివారం తెల్లవారుజామున ఇంటికి వేసిన తాళాన్ని పగులగొట్టి ఇంట్లోకి చొరబడిన దొంగలు బీరువా తలుపులను రాడ్డుతో పెకలించి అందులో ఉన్న రూ.16వేల నగదు, రెండుతులాల బంగారు నెక్లెస్, 20తులాల వెండి పట్టీలు, కమ్మలు, ఉంగరం దోచుకెళ్లారు. ఆదివారం ఉదయం జరీనా దంపతులు ఇంటికి తిరిగి చేరుకోవడంతో చోరీ విషయం వెలుగులోకి వచ్చింది. అలాగే ఇరుముస్టి జమ్ములయ్య ఇంటిలో రూ.20వేల నగదు, బంగారు కమ్మలు బుట్టాలు దోచుకెళ్లారు. వీరితో పాటు అంగన్‌వాడీ టీచర్ దేవమ్మ ఇంట్లో రూ.30 వేల నగదు బంగారు, వెండి వస్తువులు గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ మారుతిశంకర్ గ్రామానికి చేరుకొని చోరీ జరిగిన ఇళ్లను పరిశీలించారు.

మహానందిలో మళ్లీ ఎలుగుబంటి సంచారం

మహానంది: మహానంది ఆలయం వెనుక భాగంలో ఆదివారం ఓ ఎలుగుబంటి కనిపించడంతో స్థానికులు, భక్తులు భయాందోళనలకు గురయ్యారు. కొద్ది రోజుల క్రితం ఓ ఎలుగుబంటిని తెలుగుగంగ క్వార్టర్స్ వద్ద పట్టుకుని అడవిలో వదిలేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత మళ్లీ మరో ఎలుగుబంటి స్థానిక పార్వతీపురం, ఈశ్వర్‌నగర్ కాలనీల్లో సంచరించింది. తాజాగా ఆదివారం మరో ఎలుగుబంటి కనిపించడంతో తెల్లవారుజామున విధులకు వెళ్లే ఆలయ అర్చకులు, ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆలయం వెనుక ఉన్న చెట్లపొదల్లో కనిపించిందని స్థానికులు తెలిపారు.

విజయదశమికి ఏర్పాట్లు పూర్తి

నందికొట్కూరు: మున్సిపాలిటీ ఆధ్వర్యంలో విజయదశమికి ఏర్పాట్లు పూర్తి చేశారు. మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాలుగు రోజుల నుంచి జమ్మి చెట్టు వద్ద ఏర్పాట్లు కమిషనర్ కిషోర్ పూర్తి చేపట్టారు. ఆదివారం ఏర్పాట్లను చైర్మన్, వైఎస్సార్‌సీపీ నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు పరిశీలించారు. జమ్మి చెట్టు వద్ద విద్యుత్ దీపాలంకరణతో అలంకరించారు. సోమవారం జమ్మికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మున్సిపాలిటి అధికారులు, పోలీసులు పకడ్బందీగా చర్యలు తీసుకున్నారు. జమ్మి చెట్టు వద్ద క్యూలైన్లు ఏర్పాటు చేశారు. సాయంత్రం 4 గంటలకు గణపతి ఆలయం నుంచి జమ్మిచెట్టు వరకు గ్రామోత్సవం ఉంటుందని చైర్మన్ తెలిపారు.

దొంగల హల్‌చల్

పగిడ్యాల: ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని పగిడ్యాలలో గుర్తు తెలియని వ్యక్తులు డీజిల్ ఇంజిన్లు, రోటవేటర్ పరికరాలను చోరీ చేసి హల్‌చల్ సృష్టించారు. ఆదివారం పగిడ్యాల గ్రామానికి చెందిన పక్కీరయ్య, కొంగర చిన్న బాబులకు చెందిన ఆయిల్ ఇంజిన్లను దొంగలు చోరీ చేయగా, ఎంపీటీసీ గోపాల్‌కు చెందిన ఇంజిన్ పైపులు కోసి వదిలి వెళ్లారు. కేసీ కాలువ నీటిని మిరప పొలానికి కట్టేందుకు వాడే ఇంజిన్లు చోరీకి గురి కావడం పట్ల రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒక్కో ఇంజిన్ విలువ రూ.40 ఉంటుందని రైతులు వాపోయారు. అలాగే బీరవోలు గ్రామానికి చెందిన బోయ జయరాఘవ నాయుడు, పడమర వనుములపాడుకు చెందిన వెంటప్ప అనే రైతులు పొలం వద్ద వదిలిన రోటవేటర్లను వారం రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. దొంగతనాలపై రైతులు ముచ్చుమర్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మతిస్థిమితం లేని బాలుడు మృతి

మిడుతూరు: చింతలపల్లి గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని మూల జయకిరణ్ (16) నీటి కుంటలో పడి మృతి చెందాడు. తమ కుమారుడు కనిపించడం లేదని మూల రామకృష్ణ శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కుటుంబీకులు చుట్టు గ్రామాల్లో గాలిస్తుండగా ఆదివారం గ్రామంలోని నీటి కుంటలో శవమై కనిపించాడు. బాలుడు జయకిరణ్ మతిస్థిమితం సరిగా లేదని కుటుంబసభ్యులు తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


నందికొట్కూరు నియోజవకర్గ ప్రజలకు
విజయదశమి శుభాకాంక్షలు
శ్రీ వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి గారు
ముఖ్యమంత్రివర్యులు
శ్రీ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి గారు
ఎపి శాప్ ఛైర్మెన్
రాష్ట్ర యువజన విభాగపు అధ్యక్షులు
చెవుల సుజాత
సర్పంచ్, నాగటూరు గ్రామం
నందికొట్కూరు మండలం.
లక్ష్మి నరసింహారెడ్డి
నాగటూరు గ్రామం
నందికొట్కూరు మండలం.
స్నేహశీలి, పేద, ధనిక తేడా చూడని స్వభావం, యువ కెరటం,
మా ప్రియతమ నాయకులు, శ్రీ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి ఎపి శాప్ ఛైర్మెన్, రాష్ట్ర యువజన
అధ్యక్షులు గారికి మరియు నియోజక వర్గ ప్రజలకు, నాగటూరు గ్రామ ప్రజలకు,
నాయకులకు అందరికీ విజయదశమి శుభాకాంక్షలు.
యస్.హుసేనయ్య
ఉపసర్పంచ్, నాగటూరు గ్రామం,
మాజీ సింగిల్ విండో ఛైర్మెన్
పి.సుజిత్ కుమార్‌రెడ్డి
వైఎస్ఆర్‌సిపి నాయకులు,
నాగటూరు గ్రామం
వైవిజి.శ్రీరాములు
వైఎస్ఆర్‌సిపి నాయకులు,
నాగటూరు గ్రామం
యస్.సుధాకర్
వైఎస్ఆర్‌సిపి నాయకులు,
నాగటూరు గ్రామం